సర్దుబాటుపై ఆగ్రహం

- జిఒ 117 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు
- గత ప్రభుత్వ జిఒనే అమలు చేయడంపై ఆగ్రహం
- సీనియారిటీ లెక్కింపుపై వ్యతిరేకత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల సర్దుబాటుపై వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 117ను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఉండగా అదే జిఒ ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని నిర్ణయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఒను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని నారా లోకేష్ ఎన్నికల సందర్భంలో ప్రకటించారు. ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న లోకేష్ జిఒ 117 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు తీసుకోవడం పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధంగా వ్యవహరిస్తోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 4,279 మంది స్కూల్ అసిస్టెంట్లు, 2,621 మంది ఎస్‌జిటిలు పని చేస్తున్నారు. గత సోమవారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు విద్యాశాఖ అధికారులు జాబితాలను విడుదల చేశారు. విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో ఉపాధ్యాయుల సీనియారిటీ లెక్కింపులో అశాస్త్రీయ విధానంతో చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. ప్రస్తుతం తాత్కాలికంగా పాఠశాలలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులను జారీ చేసింది.

పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ లెక్కింపులో విద్యాశాఖ తీసుకున్న చర్యల పట్ల ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఉపాధ్యాయులు పుట్టిన తేదీ ఆధారంగా సీనియారిటీని లెక్కించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రకారం అనేక మంది సీనియర్ ఉపాధ్యాయులు జూనియర్లుగా మారే అవకాశం ఉండడంతో పని సర్దుబాటులో వీరికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఉపాధ్యాయుల సీనియారిటీ లెక్కింపునకు డిఎస్సీ ద్వారా నియమితులైన వారి సర్వీసులో వచ్చిన తేదీ నుంచి తీసుకుంటే బాగుంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ తీసుకున్న చర్యల ప్రకారం సీనియార్టీని లెక్కిస్తే అనేకమంది ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని విమర్శిస్తున్నారు.

గుట్టుగా జిఒ 117 అమలు

పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో జిఒ 117ను గుట్టుగా అమలు చేస్తూ నిబంధనలను విడుదల చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన జిఒను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలను కూడా చేపట్టాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధంగా అడుగులు వేయడం పట్ల గగ్గోలు పెడుతున్నాయి. జిఒ 117 ప్రకారం సర్దుబాటు ప్రక్రియను నిర్వహిస్తే అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే అవకాశం ఉంది. ఈ చర్యల వల్ల జిల్లాలో అనేక ప్రాథమిక పాఠశాలలు కూడా మూతపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ జిఒను నిలుపుదల చేసి జిఒ 54 ప్రకారం సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జిఒ 117ను రద్దు చేయాలి

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

రాష్ట్ర ప్రభుత్వం జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలి. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను బహిష్కరణ చేస్తున్నాం. ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎలాంటి అభిప్రాయమూ తీసుకోకుండానే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏకపక్షంగా సర్దుబాటుకు చర్యలు తీసుకోవడం సరైంది కాదు. సీనియార్టీని లెక్కించేటప్పుడు ప్యానెల్ ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలి. మండల, డివిజన్ స్థాయి వరకే సర్దుబాటు పరిమితం చేయాలి.

సర్దుబాటు ద్వారా పాఠశాలల మూత

- గోకారి, ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ద్వారా అనేక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. విద్యాశాఖ తీసుకుంటున్న చర్యల పట్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కానున్నాయి. సర్‌ప్లస్ ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాలి.

కొత్త షెడ్యూల్ ప్రకారం సర్దుబాటు

- కె.శామ్యూల్, డిఇఒ.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై ప్రస్తుతానికి తాత్కాలికంగా వాయిదా పడింది. అన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు కొత్త షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఆ షెడ్యూల్ వచ్చిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపడతాం.

భూసమస్యలపై అర్జీలు తీసుకోవాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 16 నుండి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చే అర్జీలను తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఎమ్మెల్యేలు గౌరుచరితరెడ్డి, పార్థసారథి, కెఇ.శ్యాంబాబు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విఆర్ఒ, నోడల్ అధికారి, దేవదాయ శాఖ అధికారి, రిజిస్ట్రేషన్, అటవీ, సర్వేయర్, వక్ఫ్‌బోర్డ్ అధికారులందరూ కలిసి ఒక టీంగా ఏర్పడి ఒక గ్రామానికి సంబంధించిన రికార్డ్స్ తీసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. రెవెన్యూ సదస్సులు పెద్ద గ్రామాలైతే ఒకరోజు, చిన్న గ్రామాలైతే సగం రోజు నిర్వహించే విధంగా సంబంధిత తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రతి అర్జీని 45 రోజులలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యూటేషన్స్‌కు సంబంధించిన అర్జీలు రాగానే, ఆలస్యం కాకుండా వారితో అక్కడే దరఖాస్తు చేయించే విధంగా మీ సేవ కౌంటర్ ఒకటి ఏర్పాటు చేసుకోవాలన్నారు. సర్వే రాళ్లపై ఉన్నటువంటి బొమ్మలను తొలగించే విధంగా కూడా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సదస్సుల్లో అధికారులు ఓపికగా వ్యవహరించి సమస్యలు పరిష్కరించే విధంగా ప్రజలకు సహకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం అయ్యాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేలు కోరారు.

ప్రత్యేక చట్టాన్ని తేవాలి

- జూనియర్ డాక్టర్ల నిరసన ర్యాలీ

- విధుల బహిష్కరణ

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కోల్‌కతాలోని ఆర్‌జికార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు నిరసనగా కర్నూలు జూనియర్ డాక్టర్లు , పిజీలు ,ఎంబిబిఎస్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కర్నూలు మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నుంచి జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభమై సూపర్ స్పెషాలిటీ బ్లాక్ తదితర వార్డుల మీదుగా క్యాజువాలిటీ వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమం మెడికల్ కాలేజ్ జూడాల యూనియన్ నాయకులు అచ్యుత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీకి భారీగా జూనియర్ డాక్టర్స్, పీజీలు హాజరయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. బాధిత కుటుంబా నికి న్యాయం చేయాలని, ఆస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని వైద్యులు డిమాండ్ చేశారు. నిరసన నేపథ్యంలో కర్నూల్లో ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో కొన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఈ ఘటనపై వెంటనే సిబిఐతో దర్యాప్తు చేయించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని, వైద్యుల రక్షణ విషయంలో సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని కేంద్రం వెంటనే అమలు చేసేలా రాతపూర్వక హామీ ఇవ్వాలన్నారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం నాయకులు పవన్ కళ్యాణ్, భరత్, భార్గవ్ పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న జూనియర్ వైద్యులు

ఓటర్ల జాబితా సవరణకు చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ఎన్నికల సమ్మరీ రివిజన్, తదితర అంశాలపై అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమావేశం నిర్వహించారు. ఈనెల 20 నుండి అక్టోబర్ 18 వరకు ఓటర్ల సర్వే చేపట్టాలన్నారు. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించి, అక్టోబర్ 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 24గా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలించి పరిష్కార చేస్తామన్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ప్రాణదాతలుగా మారండి...

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ అవయవ దానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో రాజ్ విహార్ నుండి కలెక్టరేట్ వరకు అవయవ దానం చేసి ప్రాణదాతలుగా మారాలని ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కెజి. గోవింద్ రెడ్డి పాల్గొన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎస్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కేతవరం నుంచి రోడ్డు వేయాలి

- ఎమ్మెల్యే గౌరు చరితకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేతవరం నుండి గార్గేయపురం వరకు గుంతల మయమైన రోడ్డును వెంటనే కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ ఎమ్మెల్యేను కోరారు. మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని సిపిఎం ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. జి.రామకృష్ణతోపాటు మండల కార్యదర్శి బి.నాగన్న కేతవరం గ్రామ కార్యదర్శి జి.శ్రీధర్ మండల నాయకులు వెంకటేశ్వర్లు , సూర్యనారాయణ, రంగస్వామి, వెంకటస్వామి, నాగరాజు, బుగ్గ రాముడు, కృష్ణ పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ కేతవరం నుండి నిత్యం అనేకమంది విద్యార్థులు గర్భిణీలు ప్రయాణికులు జిల్లా కేంద్రానికి వెళ తుంటారన్నారు. నాలుగు కిలోమీటర్లు ఉన్న రోడ్డు దాటుకుని వెళ్లాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగిన అత్యవసర చికిత్స కోసం అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి లేదంటే రోడ్డు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ గ్రామంలో ఆదిమానవులు సంచరించిన ప్రదేశం కావడంతో అనేకమంది ఇక్కడికి పర్యాటకులు కూడా వస్తున్నారన్నారు. రోడ్డును నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వంతో చర్చించి రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు గఫూర్‌మియా, మద్దిలేటి, బలరాముడు, వెంకటేశ్వర్లు, శేషాద్రి, శ్రీధర్, వెంకటస్వామి, నాగలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రాధాన్యతా క్రమంలో నిధులు ఖర్చు చేయాలి

మేయర్, కమిషనర్‌తో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ బివై.రామయ్య, కమిషనర్ పివి రామలింగేశ్వర్‌తో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలు నగర ప్రజల సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లగా రూ.22 కోట్లు విడుదల చేశారని, అందులో రూ.9 కోట్లు ప్రథమంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆ నిధులను ప్రాధాన్యతాక్రమంలో ఎక్కడ ఎక్కువ సమస్యలు ఉంటే అక్కడ నిధులను వినియోగించి అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరించాలని గౌరు చరిత కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ కె .విశ్వేశ్వర్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, నగరపాలక సంస్థ వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మునెప్ప

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- సి బెళగల్

సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మునెప్ప అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా సాగింది. ప్రధానంగా ఎంపిడిఒ రాముడు సమక్షంలో సి.బెళగల్ బస్టాండ్ పురోగతి, విస్తరణ, మరుగుదొడ్లు, మార్కెట్ అత్యవసరమని ఎంపీటీసీ లు సర్పంచులు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు వేళలు పాటించాలని పథకాలు, సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేలా తగు దృష్టి సారించాలని పలువురు చెప్పుకోగా సమిష్టి పాలన దిశగా పని చేయాల్సి ఉంటుందని ఎంపీడీఓ రాముడు పలువురికి సూచించారు

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

సిఎండి కె.సంతోషరావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న సిఎండి కె.సంతోషరావు

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించరాదని సదరన్ పవర్‌డిస్ట్రిబ్యూష్ కంపెనీ లిమిటెడ్ ఎపి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశించారు. మంగళవారం కర్నూలు విద్యుత్ భవనం సమావేశ మందిరంలో తిరుపతి , ఉమ్మడి కర్నూలు జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. సిఎండి మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించరాదని ఆదేశించారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం తగ్గించాలని ఏదైనా అంతరాయాలు ఏర్పడిన యెడల వెంటనే స్పందించి పునరుద్ధరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని , మండల , గ్రామస్థాయి అధికారిక మీటింగులలో అందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించినారు. విద్యుత్ నియంత్రికలు కాలిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని, విద్యుత్ బిల్లులు అన్ని వసూలు చేసి బకాయిలు లేకుండా 100శాతం వసూలు చేయాలన్నారు. అధిక లోడు ఉండే 33 కెవి లైన్ , 12 కెవి లైన్లను అదనంగా కొత్త ఫీడర్లను నిర్మించుటకు తగు చర్యలు తీసుకొని లోవోల్టేజ్ సమస్యలు లేకుండా చేయాలని సూచించారు. రోడ్డు క్రాసింగ్ లైన్ల ఎత్తు పెంచుట , లైన్ల నిర్వహణపై అశ్రద్ధ వహించరాదని చెప్పారు. అధికారులు , కార్మికులు వారి వారి హెడ్ క్వార్టర్స్ లో ఉండి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి సంస్థపై ప్రజలలో మంచి అభిప్రాయం కలిగించాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా పీఎం సూర్యఘర్ గురించి ప్రజలకు అవగాహన కలిగించి దీనికి కావలసిన ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమమునకు కార్పొరేట్ ఆఫీస్ నుంచి చీఫ్ జనరల్ మేనేజర్, ఆపరేషన్ అండ్ మేంటనెన్స్, ఆర్ పద్మ, కెఆర్ఎస్.ధర్మజ్ఞాని, చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్అండ్ఐఎ ఎపిఎస్‌పిడిసిఎల్ వచ్చారు. కర్నూల్ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.ఉమాపతి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ పి. ఓబులేష్ , సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె.చిన్నరాఘవులు , ఉమ్మడి కర్నూలు జిల్లా ఆపరేషన్, మీటర్స్ అండ్ ప్రొటెక్షన్, కన్‌స్ట్రక్షన్, డిపిఇ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సును ఉపయోగించుకోండి

తహాశీల్దార్ డి చంద్రశేఖర్

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 16నుంచి సెప్టెంబర్ 29వరకు మండలంలో గ్రామ రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ డి. చంద్రశేఖర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో తహశీల్దార్లు, సర్వేయర్లు, ఆర్ఐలు, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి హాజరై గ్రామంలో రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించు కోవాలన్నారు. చుక్కల భూములు, నేషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చుట, అసైన్డ్ భూములు, ఆలియా సెట్ భూములు, ఖాతా నెంబర్లకు ఆధార్ నమోదు వంటి సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రైతులు పెట్టుకున్న అర్జీలను పరిశీలించి మూడు నెలలలోపు వాటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. **తహాశీల్దార్‌ను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకుడు :** క్రిష్ణగిరి మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.చంద్రశేఖర్‌ను ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్కసాగరం హనుమంతు మాదిగ మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో జరుగుతున్న భూ అక్రమాలపై ఎస్‌సి, ఎస్‌టిల భూములపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని, ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేపట్టాలన్నారు. హనుమంతు తహశీల్దార్ చంద్రశేఖర్ తో చర్చించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

అద్దెబస్సు డ్రైవర్లకు పిఎఫ్,ఇఎస్ఐ అమలు చేయాలి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్.

పిటిడి (ఎపిఎస్‌ఆర్‌టిసి)లో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు పిఎఫ్ ,ఇఎస్ఐ అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి .అంజిబాబు డిమాండ్ చేశారు.ఈమేరకు కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో మంగళవారం అద్దె బస్సు డ్రైవర్లతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని యూనియన్ కార్యదర్శి యు.శ్రీనివాసులు అధ్యక్షతన చేపట్టారు. అంజిబాబు మాట్లాడుతూ ఆర్‌టిసి అద్దె బస్సు ఓనర్లతో జరిగిన ఒప్పందంలో కార్మిక చట్టాలు అమలు చేయాలని ఉన్నదని, అద్దె బస్సు డ్రైవర్లకు మాత్రం పిఎఫ్, ఇఎస్ఐ సెలవులు ఏమీ అమలు కావడం లేదని అన్నారు. కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు రోజురోజుకీ పని భారం పెరుగుతుందని, వర్షాలు రావడం వల్ల రోడ్లు చెడిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలు పెడితే అద్దె బస్సు డ్రైవర్ల పైన పని భారం పడుతుందని, పని భారానికి తగ్గట్టుగా వారి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్‌టిసిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈ మధ్యకాలంలో ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించారని, అటువంటి సౌకర్యాన్ని అద్దె బస్సు కార్మికులకు కూడా కల్పించాలని కోరారు. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ -హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో కెవిఆర్ పాఠశాల, విద్యార్థులచే 150 అడుగుల జాతీయ జెండాతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. లయన్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, లయన్ గోపీనాథ్ తదితర క్లబ్ సభ్యులు జాతీయ జెండా, లయన్స్ ఫ్లాగ్‌లను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా చైర్మన్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సంపూర్ణ పేదరిక నిర్మూలన జరిగే వరకూ ప్రతి ఒక్కరూ దేశభక్తితో నిస్వార్థంగా పనిచేసినప్పుడే సమగ్ర దేశాభివృద్ధి జరిగి, నిజమైన స్వాతంత్ర ఫలాలు అందరికీ అందుతాయని అన్నారు.

రెండోరోజూ టిబి డ్యాంను పరిశీలించిన ఎంపి

మంత్రులతో కలిసి అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తుంగభద్ర జలాశయాన్ని ఎపి జనవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లతో కలిసి కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు రెండోరోజు సందర్శించారు. డ్యామ్ లో గేటు కొట్టుకుపోయిన ప్రదేశాన్ని మంత్రులతో కలిసి ఎంపి పరిశీలించారు.. ఈ సందర్భంగా వారు అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులపై ఆరా తీశారు.. అనంతరం గేట్ల నాణ్యత, మరమ్మతుల పై అధికారులతో సమీక్షించి, గేటు కొట్టుకుపోయిన ప్రాంతంలో కొత్త గేటు ఏర్పాటు చేయడం పై ఇంజినీర్లతో మాట్లాడరు..ఎంపి నాగరాజు మాట్లాడుతూ గేటు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టి డ్యామ్ లోని ప్రతి నీటి చుక్కను ఆదా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు.. డ్యామ్‌లో గేటు కొట్టుకుపోవడంతో నీరువృధా గా పోతూ కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాల రైతులు నష్టపోవాల్సి వస్తుందని, రైతులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంత్రులు, ఎంపి, గుంతకల్లు ఎమ్మెల్యేగుమ్మనూరు జయరాం, ఆలూరు టిడిపి ఇంచార్జి వీరభద్ర గౌడ్‌లు ఉన్నారు.

పరిధిని మించి వైద్యం చేస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఆర్ఎంపిలు పరిధిని మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ హెచ్చరించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో ఆదోని నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆర్ఎంపిలతో సబ్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్ఎంపిలు యాంటీబయాటిక్ మెడిసిన్ ఇవ్వడానికి కూడా అర్హత లేదన్నారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని తెలిపారు. జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులు, జలుబు వస్తే వారికి ట్యాబ్లెట్లు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఒకవేళ 24 గంటలు గడిచినా తగ్గకపోతే గ్రామాల్లో ఉన్న ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌సి, పిహెచ్‌సి కేంద్రాలకు పంపించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెలైన్ బాటిళ్లు ఎక్కించకూడదన్నారు. గ్రామాల్లో అక్కడక్కడ అన్ వాంటెడ్ కిడ్స్ ద్వారా గర్భిణులకు అబార్షన్ చేసి భ్రూణహత్యలు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటివి చేస్తే పిసిపి అండ్ యాక్ట్ కింద జరిమానాతోపాటు జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం గ్రామంలోని హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రజలు వైద్యం కోసం దగ్గరకొస్తే వారిని గ్రామంలో ఉండే పిహెచ్‌సి/సిహెచ్‌సి కేంద్రాలకు పంపించాలని సూచించారు. నిబంధనలు పాటించని ఆర్ఎంపిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, డాక్టర్ బాలమురళీ పాల్గొన్నారు.

పంట పొలాలకు హంద్రీనీవా నీరందించాలి

- తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - దేవనకొండ

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

పందికోన రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష, మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహశీల్దార్ జయన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈఏడాది ఖరీఫ్ మొదలై 80 రోజులు కావస్తోందని, సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఆయా సాగునీటి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం హంద్రీనీవా ద్వారా పంట పొలాలకు వెంటనే నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో హంద్రీనీవా ద్వారా 80 వేల ఎకరాలకు పైగా సాగునీరు రావాలని, క్రిష్ణగిరి, పందికోన రిజర్వాయర్ల ద్వారా ప్రభుత్వం పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. కర్నూలు -గుంటూరు హైవే నిర్మాణం సందర్భంగా హంద్రీనీవా కాలువ పూడ్చివేత, మల్లెపల్లి దగ్గర గండి నేపథ్యంలో కాలువకు నీరు ఆలస్యంగా వస్తోందని తెలిపారు. పంటలకు నీరిచ్చే విషయంలో ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని, పంట పొలాలకు అందించే ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక శ్రద్ధ పెట్టి హంద్రీనీవా ద్వారా పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవనకొండ, పల్లె దొడ్డి, కుంకునూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నవోదయలో రెండోరోజూ రోప్ స్కిప్పింగ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జవహర్ నవోదయ విద్యాలయంలో రెండోరోజూ స్కిప్పింగ్ పోటీలు, నృత్యాలు కొనసాగాయి. మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ టెక్నికల్ అధికారులు అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలుగా విభజించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. మొదట వేగం (30 సెకన్లు), డబుల్ అండర్ (30 సెకన్లు), ఎండ్యూరెన్స్ (3 నిమిషాలు) ఉంటుంది. విద్యాలయ ప్రిన్సిపల్ ఈ.పద్మావతి మాట్లాడారు. వివిధ విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్, ఎకె.బసవరాజ్, ఎర్రిస్వామి, శ్రీలక్ష్మి, జగన్నాథ్, హరీష్ కుమార్, శిరీష, శ్రీనివాసరావు, శివాజీ రావు, వెంకటేష్, అంజలి, పద్మావతి (లైబ్రేరియన్), శిరీష (స్టాఫ్ నర్స్), నీలవేణి, సంజీవ్ కుమార్, భాస్కర్, రామదాస్, నబీ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ పద్మావతి

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతర పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీలో నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి నిరంతర పోరాటాలు చేయాలని, విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందింపజేయాలని నాయకులు కోరారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ 47వ జిల్లా ప్లీనరీ సమావేశం తేరు బజారులోని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షులు రంగప్ప ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, ప్రముఖ వైద్యులు మాలకొండయ్య, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి, ఎన్నో పాఠశాలలను తీసి వేయకుండా కాపాడినట్లు తెలిపారు. నూతన విద్యా విధానం అమలులో భాగంగా విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని, జిల్లాలో చాలా పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు ఉన్న పరిస్థితి ఉందని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు భర్తీ కాలేదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పడిపోయిందని తెలిపారు. జిఒ 77ను తీసుకొచ్చి పిజి విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక సహాయం అందకుండా చేశారని చెప్పారు. ఎక్కువ మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని తెలిపారు. వైద్య విద్యలో 50 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చి సీట్లు అమ్ముకోవడం వల్ల అనేకమంది పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యారంగాన్ని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వాలు చూస్తున్నాయని విమర్శించారు. రాబోయే కాలంలో ప్రభుత్వ విద్య బలోపేతం కోసం పోరాడాలని కోరారు. అలాగే కొందరు విద్యార్థులు మద్యం, ధూమపానం, మారకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపార. వాటికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడంతో పాటు పోరాడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవి, శ్రీనివాసులు, సాయి, జిల్లా సహాయ కార్యదర్శులు విజయ్, సంయుక్త పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజా వైద్యులు మాలకొండయ్య

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ బిందు మాధవ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నది వరద నీటి ప్రవాహాన్ని ఎస్పీ బిందు మాధవ్ పరిశీలించి తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మంగళవారం మంత్రాలయం చేరుకున్న ఆయన ఎస్‌డిఎఫ్ పోలీసు బృందాలతో మాట్లాడారు. నది వరద ఎక్కువగా ఉన్నప్పుడు భక్తులు, చిన్నపిల్లలు, ప్రజలు నదిలోకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, క్యూలైన్, విఐపిల ప్రొటోకాల్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆదోని డీఎస్పీ సోమన్న, స్పెషల్ బ్రాంచి సిఐ నాగరాజు యాదవ్, మంత్రాలయం సిఐ రామాంజులు, స్పెషల్ బ్రాంచి ఎస్ఐ వేణుగోపాల్ రాజు, ఎస్ఐలు గోపినాథ్, కృష్ణమూర్తి ఉన్నారు.

గోనెగండ్ల : గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకొస్తే సత్వరమే స్పందించి తగిన చర్యలు చేపడతామని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. మండలంలోని ఫ్యాక్షన్ ప్రభావిత కున్నూరు గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో ఉన్న పోలీసు పికెట్ పాయింట్‌ను తనిఖీ చేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు. పికెట్ బందోబస్తులో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడారు. పోలీసులు గ్రామంలోని ప్రజలతో మమేకమై సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలోని సమస్యల గురించి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, ఎలాంటి గొడవలకూ దిగవద్దని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే తగిన చర్యలు తీసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్పెషల్ బ్రాంచి సిఐ నాగరాజు యాదవ్, గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్, స్పెషల్ బ్రాంచి ఎస్ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

ముందుచూపు లేకనే గేటు చైను విరిగింది

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఇరు రాష్ట్రాల అధికారులకు ముందు చూపు లేకనే తుంగభద్ర డ్యామ్ 19వ గేటుకు ఉన్న చైన్ విరిగిపోయిందని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. మంగళవారం చిప్పగిరిలోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముమ్మాటికీ అధికారులు నిర్లక్ష్యమేనని, ఈ నిర్లక్ష్య వైఖరితో రైతుల ఆశలపై నీళ్లు చల్లారని తెలిపారు. ఉన్న నీరంతా ఖాళీ అయితే రాబోయే రబీ సీజన్ పంటలకు నీరు అందుతుందో లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. తక్షణమే ఇరు రాష్ట్రాలు హై టెక్నికల్ ఇంజినీర్లను పెట్టి గేటుకు మరమ్మతులు చేయాలని ఇరు రాష్ట్రల ప్రభుత్వాలను కోరారు. వైసిపి ప్రభుత్వంలో చెప్పిన పథకాలన్నీ ఏ నెలలో అందేవో ఆ నెలలోనే అందించిన ఘనత జగన్‌కు దక్కిందన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పి దానిని కూడా ఇతరులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. వైసిపి నాయకులను వేధించడమే పని పెట్టుకుని పరిపాలనపైన దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏది జరిగినా జగన్‌పై నిందలు వేయడం తగదన్నారు. జగన్ ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి, రైతులకు పెట్టుబడి సాయం అందించే వారని ప్రజలే చర్చించుకుంటున్నారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు చూస్తేనే భయమేస్తోందని, ప్రజలే అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి అనడం చాలా విడ్డూరంగా ఉందని చెప్పారు. ఉచిత పథకాలు ఇవ్వండని ప్రజలు ఏనాడూ అడగలేదని, అధికారం కోసం ఉచిత పథకాలు ప్రకటించి ఇప్పుడు పేదలను మోసం చేయడం తగదని తెలిపారు. మాట ఇచ్చారంటే నిలబెట్టుకోవడం జగన్‌కే చెల్లుతుందని చెప్పారు. గతేడాది రబీలో నష్టపోయిన రైతులందరికీ వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య, మాజీ కన్వీనర్ ఓబులేసు, వైసిపి సీనియర్ నాయకులు కుందనగుర్తి నాగప్ప పాల్గొన్నారు.

అవయవ దానం ప్రాణదానంతో సమానం

- లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

అనారోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి అవయవ దానం చేయడం ప్రాణదానం చేయడంతో సమానమని లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గోపీనాథ్, ప్రముఖ కంటి వైద్యులు కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఒకేషనల్ కళాశాలలో ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్, అవోపా ఆధ్వర్యంలో పారా మెడికల్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రక్తం, కళ్లు, కాలేయం, కిడ్నీలు, ప్యాంక్రియాసు, గుండె, ఊపిరితిత్తులు, బోన్ అవగాయవాలను దానం చేయచ్చని తెలిపారు. బతికుండగానే దాన ఒప్పందాన్ని చేసుకోవచ్చన్నారు. ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్, అవోపా రఘు, ఈరన్న శెట్టి, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

పరిశుభ్రమైన నీరందించడానికి కృషి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశుభ్రమైన నీరందించడానికి మున్సిపల్ సిబ్బంది నిరంతర కృషి చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం గుడికల్ రోడ్డులో ఉన్న ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. వాటర్ క్లోరినేషన్, సప్లయిని పరిశీలించారు. అలాగే పట్టణంలోని షరాఫ్ బజార్, జామియా మసీదు ఏరియాలో పారిశుధ్య పనులు, కుళాయి నీటి సరఫరాను పరిశీలించారు.

ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

CHANGE IN SURNAME & GIVEN NAME

I, CHAPALA VIJAY KUMAR (Old Name) R/o.Flat No:404, Suresh Apartments, Santosh Nagar, Near Lokayukta Office, kurnool dist, AP., have changed my name as CHAPAALA VIJAY KUMAR REDDY (New Name) S/o. CHAPALA NARAYAN REDDY

CHANGE IN SURNAME

I, CHAPALA SHARADA (Old Name) R/o.Flat No:404, Suresh Apartments, Near Santosh Nagar, Near Lokayukta office, kurnool dist, AP., have changed my name as CHAPAALA SHARADA (New Name) W/o. CHAPAALA VIJAY KUMAR REDDY

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఆదోని

బ్రిటీష్ కాలం నుంచి ఘన చరిత్ర కలిగిన ఆదోని మున్సిపాలిటీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని ప్రాంతం పత్తి, వేరుశనగ పంటలకు ప్రసిద్ధిగాంచిందని, ఆదోనిలో మూడు స్పిన్నింగ్ మిల్లులు, ఆరు ఆయిల్ ఫ్యాక్టరీలు, వందల సంఖ్యలో జిన్నింగ్, ప్రెస్సింగ్, ఫ్యాక్టరీలు ఉండడంతో వేలాది మందికి ఉపాధి దొరికేదని తెలిపారు. అప్పుడు ఆదోని కళకళలాడుతూ రెండో ముంబయిగా ప్రసిద్ధికెక్కిందన్నారు. అలాంటి ఆదోనిలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల వల్ల పరిశ్రమలు మూతపడడంతో వేలాదిమంది ఉపాధి కోల్పోవడం, ఎల్ఎల్‌సి కాలువ మండలంలో ప్రవహిస్తున్నా సాగునీటి సౌకర్యం సరిగ్గా లేకపోవడం, వర్షాలపై ఆధారపడడంతో రైతులు నిత్యం కరువుతో విలవిల్లాడుతూ జీవనం సాగుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని అభివృద్ధికి నోచుకోక ఉపాధి లేక ఇక్కడి ప్రజలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ఆదోని అభివృద్ధి కోసం పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బైపాస్ రోడ్డును పూర్తి చేయాలని కోరారు. కాటన్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కొత్త పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రి, స్త్రీలు, చిన్నపిల్లల ఆస్పత్రిలో అన్ని రకాల జబ్బులకు వైద్యులను నియమించి, మెరుగైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడలను ప్రోత్సహించేందుకు పట్టణంలో అవుట్‌డోర్, ఇండోర్ స్టేడియాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని కోరారు. నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్, వెంకటేష్, కృష్ణమూర్తి, నాగేంద్ర, రాజు, హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథికి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISION) :: ADONI
I.A. No: 372/2023
IN
O.S. NO: 382/2019.

Between:
S.Eranna. ...Petitioner.
Versus
H.Sreenath. ...Respondent.

NOTICE TO RESPONDENT.

To,
H.Srinath, S/o. H.S.Nagabhushanam Setty,
aged about 40 years, Hindu, Business,
D.No: 1/541/44A, NGO's Colony, Adoni,
Kurnool District.

Whereas the above named petitioner filed the above petition against you to pass Final decree in terms of Preliminary decree. You are hereby order to take notice and appear before this court at 10.30 A.M., on 02/09/2024 in person or through advocate and file your objections if any. Else you will be set exparte and the above petition will be decided in your absence.

// By Order of the Court//
Sri C.SOMA SEKHAR,
Advocate for petitioner,
Adoni.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ఆస్పరి

కేరళ వయనాడ్ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు తెలిపారు. మంగళవారం ఆస్పరిలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కిరాణ షాపులు, హోటళ్లు, టీ స్టాల్, కూరగాయల యజమానులతో విరాళాలు సేకరించారు. వారు మాట్లాడారు. వయనాడ్ వరదల భీభత్సంతో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు ప్రక టించి ఆదుకోవాలని కోరారు. విరాళాలిచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

యధాతథంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వైఎంకె స్కూలులోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల యధాతథంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. మంగళవారం ఆదోనిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ఉన్నత విద్య శాఖ ఛైర్మన్‌తో మాట్లాడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మార్చుకుండా చూడాలని కోరామన్నారు. ఏడాది తర్వాత నూతన భవనాన్ని నిర్మించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్కూల్ యాజమాన్యం చెన్నబసప్పను ఆఫీసుకు పిలిపించుకుని యధాతథంగా కొనసాగించేందుకు కోరామన్నారు. భవనం అద్దె బకాయిలు ప్రభుత్వంతో మాట్లాడి వచ్చేలా చూస్తామన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.07 కోట్లు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,07,72,969 వచ్చిందని డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఇందులో నగదు రూపంలో రూ.1,07,72,969, బంగారం 52 గ్రాములు, వెండి 19 కిలోల 700 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. విదేశీ కరెన్సీ ఆస్ట్రేలియా దేశానికి చెందిన 50 డాలర్లు, అమెరికా డాలర్లు 184 వచ్చినట్లు తెలిపారు. అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ అధికారి పాండురంగా రెడ్డి, హుండీ పర్యవేక్షణ అధికారి బి.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ నిర్వహణపై అవగాహన అవసరం

- ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంచాయతీ నిర్వహణ ప్రణాళికపై సర్పంచులు అవగాహన కలిగి ఉండడం అవసరమని ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణలో భాగంగా రెండో రోజు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో పారిశుధ్యం, ఎల్ఇడి బల్బుల నిర్వహణ, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ నిర్వహణ, జిపిడిపి ప్రణాళికలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇఒఆర్‌డి నాగేష్ పాల్గొన్నారు.

చిప్పగిరి ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో రెండో రోజు శిక్షణ తరగతుల్లో భాగంగా బంటనహాళ్ గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, చెత్తను వర్మీకంపోస్ట్ ఎరువుగా ఎలా మార్చాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేటట్లు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్మికులకు సూచనలు ఇస్తూనే ఉండాలని డిపిఆర్‌సి ఉమామహేశ్వరమ్మ సూచించారు. ఇఒఆర్‌డి బాలన్న, సర్పంచులు గోవిందరాజులు, సుశీలమ్మ, భీమా, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, సుధీర్, జయరామ్ నాయక్, సురేంద్ర, రామాంజనేయులు, ప్రమీల పాల్గొన్నారు. **కౌతాళం** మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగించారు. ఎంపిడిఒ సుబ్బరాజు, కార్యాలయపు పరిపాలనాధికారి సత్యన్న మాట్లాడారు. పరిపాలన అధికారం గురించి వివరించారు. గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వర్మీ కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో సర్పంచి హెచ్.రాము అధ్యక్షతన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల దగ్గర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిఆర్‌పి నాగరాజు, టిఒటిలుగా ఎ.నాగరాజు, ఎ.విజయలక్ష్మి, ఇఒఆర్‌డి కె.నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వానపాములు నేలను సహజ పద్ధతిలో సారవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. వానపాములను రైతులకు సహజ మిత్రులుగా, వానపాము సహజంగా తేమగల నేలల్లో బొరియలు చేసుకుని భూమిలోని సేంద్రీయ వ్యర్థాలను ఆహారంగా తీసుకుని సారవంతమైన మట్టిని విసర్జిస్తాయని చెప్పారు. నాణ్యమైన వానపాములను సేకరించి చదరపు మీటరు విస్తీర్ణానికి 1500 నుంచి 2000 వరకు వదులుకోవచ్చని తెలిపారు. వానపాములు వదిలిన తర్వాత తేమ శాతం తగ్గకుండా నీరు చల్లుతూ ఉండాలన్నారు. తేమ తొందరగా ఆరిపోకుండా బెడ్‌పైన పాత గోనెసంచులు కప్పి ఉంచి దానిపై నీళ్ల చల్లితే తేమ తొందరగా ఆరిపోదని తెలిపారు.

గోనెగండ్లలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కౌతాళంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

చిప్పగిరి....

ఆదోని...

ఆదోనిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

అందరికీ రాజ్యాంగ ఫలాలు

- జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజ్యాంగం కల్పించిన ఫలాలు అందరికీ అందాలనే ఆలోచనతో క్రిమి లేయర్ అమలు దిశగా జై భీమ్ ఎంఆర్‌పిఎస్ అడుగులు వేస్తోందని వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రయివేట్ లాడ్జీలో జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 1న సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో జై భీమ్ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 2న మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ చేపట్టి సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా జిల్లా యూనిట్ కేంద్రంగా వర్గీకరణ చేయాలని ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామని చెప్పారు. ఎబిసిడి వర్గీకరణలో సంపన్న వర్గాలు మాల, మాదిగలు కొన్ని లక్షల మంది ఉద్యోగ, విద్య, ఆర్థికంగా ఎదిగిన వారు ఉన్నారని తెలిపారు. సామాన్య మాల, మాదిగలు ఉద్యోగ, విద్యా, ఆర్థికంగా వెనుకబడి వారు కోట్ల మంది ఉన్నారని చెప్పారు. గిరిజనుల్లో కూడా వర్గీకరణ పరంగా విద్య, ఉద్యోగ, ఆర్థికంగా ఎదిగిన వాళ్లే అన్నారు. సామాన్య గిరిజనులు విద్య, ఉద్యోగ, ఆర్థికంగా వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిమి లేయర్ వర్తింపజేసే విధంగా పని చేస్తూ, సామాన్య దళిత, గిరిజన పేదలకు చేయూతను అందించడానికి జై భీమ్ ఎంఆర్‌పిఎస్ ఉద్యమాలను ఉధృతం చేస్తుందని చెప్పారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మాదిగ రత్నం, ఆదోని డివిజన్ అధ్యక్షులు జగ్గుల యోహాను మాదిగ, మంత్రాలయం నియోజకవర్గ నాయకులు దేవరపాటి అనిల్ కుమార్, మారెన్న, మంత్రాలయం టౌన్ అధ్యక్షులు గోపాల్, కోసిగి మండల అధ్యక్షులు పందికోన రాజేష్, పెద్దకడబూర్ మండల అధ్యక్షులు మంచోది ఆదాము మాదిగ, మండల ఇన్‌ఛార్జీ మంచోది రవికుమార్, కౌతాళం మండల నాయకులు రేవన్న, మంత్రాలయం మండల అధ్యక్షులు నరసింహులు మాదిగ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ముఖ్యమంత్రి బాబును ఆహ్వానిస్తున్న సిబ్బంది

ఆరాధనకు ప్రముఖులకు శ్రీమఠం ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు హాజరు కావాలని శ్రీమఠం యాజమాన్యం నుంచి ప్రముఖులకు ఆహ్వానం అందింది. మంగళవారం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్ ముఖ్యమంత్రి చంద్రబాబును, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, సిఎంఒ కార్యాలయ అధికారి ప్రద్యుమ్నరావును వేర్వేరుగా కలిసి ఈనెల 18 నుంచి 24 వరకు జరిగే రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా వారికి శ్రీమఠం నుంచి శేష వస్త్రం, పరిమళ ప్రసాదం అందజేశారు.

బొలేరో వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల పరిధిలోని నగరడోన, నేమకల్లు గ్రామాల మధ్య గుంతకల్లు, ఆలూరు రహదారిపై మంగళవారం బొలేరో వాహనం ఢీకొని గుంతకల్లు పట్టణానికి చెందిన షికారి సుగుణ (35) మృతి చెందారు. షికారి గోపి, సుగుణ టివిఎస్ వాహనంపై గుంతకల్లు నుంచి నగరడోన వైపు బయల్దేరారు. బొలేరో (ఎపి 39 టియు 5536) వాహనం ముందు వైపు టైర్ పంచరై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక షికారి సుగుణ మృతి చెందారు. చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సుగుణ, గోపి నగరడోన గ్రామ సమీప పొలాల్లో పంట పొలాలకు జింకలు రాకుండా కాపలా కాసేవారు.

మహారాజ శ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఇ.ఎ.నెం.143/2023 ఇన్ ఇ.పి.నెం.43/2022
ఇన్ ఓ.యస్.నెం.344/2018

ఆర్.వనేశ్వరయ్య. ...అర్జీదారు/వేలంలో కొన్నవారు
-వర్సెస్-
1.పి.ఛాయదేవి (డి.హెచ్.ఆర్)
2.బి.నాగమణి (జె.డి.ఆర్). ...రెస్పాండెంట్లు

1,2 రెస్పాండెంట్లకు నోటీసులు

1.ఛాయదేవి భర్త బోయ నాగశివుడు,
ఇంటి.నెం.9-78,సంగాపేట, నంద్యాల మండలం,
కర్నూలు జిల్లా. ...(డి.హెచ్.ఆర్)
2.బి.నాగమణి భర్త బి.చెంచయ్య,
ఇంటి.నెం.49-50ఎ-613,
శ్రీరామనగర్, కర్నూలు సిటి. (జె.డి.ఆర్)

పైనెంబరు అర్జీలో అర్జీదారు, రెస్పాండెంట్లు అయిన మీపైన అర్జీలో తెలిపిన అర్జీ షెడ్యూలు ఆస్థిని కోర్టు వేలంలో పాల్గొని వేలంలో షెడ్యూలు అస్తిని రూ.11,00,000/-కు కొన్నారు. షెడ్యూలు అస్థిని తనకు స్వాధీనపరచమని పైకోర్టులో అర్జీదాఖలు చేసినారు. ఇందులో రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 24-8-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

Schedule: Kurnool registration and Sub Registration,Kurnool within the limits of Kurnool Corporation area bearing No.49/50-A612,Situated in Sreeram Nagar in Sy.No.781/E Piki H.No.49/50-A612 within the following boundaries.
East : Sujathamma House
West : Road
North : 4 Feet Rastha
South : House of Lalithamma,
With the following Measurments
East - West : 26 feets.
North - South: 15 Feets
Total Extent is 43.33Sq.Yards.
Construction area : East to West 26 Feet, North to South :10 Feet.
Total Construction area is 260 Square Yards of RCC Building with assessment No.1016056333.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 24-08-2024

హెచ్.కె.జలంధర్,
గోపాలకృష్ణుడు,
అర్జీదారుల పరం అడ్వకేట్లు,
కర్నూలు.